

## ఎన్నికల ప్రచారం ప్రాథమిక హక్కు కాదు
కేజ్రీవాల్‌కు బెయిల్‌పై ఈడీ వాదన

న్యూఢిల్లీ: ఢిల్లీ మద్యం పాలసీ కేసులో సీఎం అరవింద్ కేజ్రీవాల్‌కు మధ్యంతర బెయిల్ ఇచ్చే విషయాన్ని ఈడీ వ్యతిరేకించింది. ఎన్నికల ప్రచారం చేయడమనేది ప్రాథమిక హక్కు, రాజ్యాంగ హక్కు కాదని వాదించింది. గురువారం సుప్రీంకోర్టుకు ఈ మేరకు అఫిడవిట్ సమర్పించింది. 'ఎన్నికల బరిలో ఉన్న అభ్యర్థి తన ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించుకోవడానికి కూడా ఇప్పటివరకూ ఎప్పుడూ మధ్యంతర బెయిల్ ఇవ్వలేదు. ఎన్నికల ప్రచారం అనేది కనీసం న్యాయ పరమైన హక్కు కూడా కాదు' అని ఈడీ కోర్టుకు తెలిపింది. కేజ్రీవాల్‌కు మధ్యంతర బెయిల్ మంజూరుపై సుప్రీం ధర్మాసనం శుక్రవారం(నేడు) తన నిర్ణయాన్ని వెల్లడించనుంది.



## భారత ఎన్నికల్లో అమెరికా జోక్యం: రష్యా



న్యూఢిల్లీ, మే 9: భారత్‌లో జరుగుతున్న సార్వత్రిక ఎన్నికల్లో జోక్యం చేసుకోవడం ద్వారా ఎన్నికల ప్రక్రియను క్లిష్టతరం చేయాలని అమెరికా ప్రయత్నిస్తున్నదంటూ రష్యా సంచలన వ్యాఖ్యలు చేసింది. ఖలిస్థానీ వేర్పాటువాది గురుపత్వంత్‌సింగ్ పన్నున్ హత్యకు తమ దేశంలో కుట్ర జరిగిందని, దాని వెనక భారత పౌరుల హస్తం ఉందని ఆరోపించిన అమెరికా అందుకు సంబంధించి 'నమ్మదగిన సాక్ష్యాల'ను చూపలేదని రష్యా విదేశాంగ మంత్రిత్వశాఖ అధికార ప్రతినిధి మరియా జఖరోవా తెలిపారు. భారత్‌లోని మతస్వేచ్ఛను ప్రస్తావిస్తూ భారతదేశ జాతీయ మనస్తత్వం, చరిత్రపై అమెరికాకు ఏ కోశానా అవగాహన లేదని విమర్శించారు. మతస్వేచ్ఛపై నిత్యం నిరాధార ఆరోపణలు చేస్తూనే ఉన్నదని, ఇది భారత్‌ను అగౌరపరచడమేనని మండిపడ్డారు. భారత అంతర్గత రాజకీయ పరిస్థితులను అస్థిరపరచడం, సార్వత్రిక ఎన్నికలను క్లిష్టతరం చేయడమే అమెరికా ఆరోపణల ముఖ్య ఉద్దేశమని ఆమె ఆరోపించారు.

## బాలుడితో ఓటేయించిన బీజేపీ నేత

- మధ్యప్రదేశ్‌లో ఘటన..
- దర్యాప్తునకు కలెక్టర్ ఆదేశం

న్యూఢిల్లీ, మే 9: లోక్‌సభ ఎన్నికలు వాడివేడిగా సాగుతున్నవేళ.. వివిధ రాష్ర్టాల్లో ఎన్నికల నిర్వహణలో చోటుచేసుకుంటున్న అవకతవకలు మెల్లమెల్లగా బయటపడుతున్నాయి. మధ్యప్రదేశ్‌లో తాజాగా ఓ బీజేపీ నేత మైనర్ అయిన తన కుమారుడితో కలిసి ఓటేయటమేగాక, దీన్ని వీడియో తీసుకొని ఫేస్‌బుక్‌లో పోస్ట్ చేశాడు. ఈ వీడియో సోషల్ మీడియాలో ప్రసారం కావటంతో.. రాజకీయంగా తీవ్ర దుమారం రేగింది. ఎన్నికల సంఘం దీనిపై ఇంకా స్పందించలేదు. బెరాసియా ప్రాంతానికి చెందిన వినయ్ మెహర్ బీజేపీ స్థానిక నేత. తన మైనర్ కుమారుడితో కలిసి ఓటు వేసేందుకు పోలింగ్ కేంద్రానికి వచ్చాడు. తన తండ్రి స్థానంలో ఆ పిల్లాడు ఈవీఎం బటన్ నొక్కి కమలం గుర్తుకు ఓటు వేశాడు. స్మార్ట్‌ఫోన్లో వీడియో తీసుకుంటూ ఓటేశానని చెబుతూ, ఫేస్‌బుక్‌లో ఆ వీడియోను పోస్ట్ చేశాడు. దీనిపై కాంగ్రెస్ సీనియర్ నేత కమల్‌నాథ్ స్పందిస్తూ, 'ఎన్నికల సంఘాన్ని పిల్లల ఆట వస్తువుగా బీజేపీ మార్చింది. బీజేపీ నేత వినయ్ మెహర్ తన ఓటు కుమారుడితో వేయించారు. ఆ తతంగాన్ని వీడియో తీసి, ఫేస్‌బుక్‌లో పోస్టు చేశారు. పిల్లల్ని, మొబైల్ ఫోన్లను లోపలికి ఎలా అనుమతించారు? దీనిపై ఏమైనా చర్యలు ఉంటాయా?' అని కమల్‌నాథ్ ప్రశ్నించారు.

**పోలింగ్ బూత్‌ను ఆక్రమించిన బీజేపీ నేత కుమారుడు**

గుజరాత్‌లో బీజేపీ నేత కుమారుడు బూత్ ఆక్రమణకు పాల్పడ్డాడు. దీంతో ఆ పోలింగ్‌ను ఎన్నికల సంఘం రద్దు చేసింది. దాహోద్ లోక్‌సభ నియోజికవర్గ పరిధిలో ఈ ఘటన చోటుచేసుకుంది. స్థానిక బీజేపీ నేత కుమారుడు విజయ్ బాభోర్ పోలింగ్ బూత్‌ను ఆక్రమించటమేగాక, బోగస్ ఓటింగ్‌కు పాల్పడ్డాడు. ఈసీ ఫిర్యాదు మేరకు పోలీసులు అతడ్ని అరెస్టు చేశారు. మహిసాగర్ జిల్లాలో సంత్రాంపూర్ తాలూకా పార్థంపూర్ పోలింగ్ స్టేషన్‌లో మే 7న జరిగిన పోలింగ్‌లో అవకతవకలు జరిగాయని ఈసీ తేల్చింది. ఇక్కడ జరిగిన పోలింగ్‌ను రద్దు చేస్తూ, మే 11న తిరిగి పోలింగ్ చేపడుతున్నట్టు రాష్ట్ర సీఈవో తెలిపారు.



# మోదీ X పట్నాయక్

- ఒడిశాలో బీజేడీ – బీజేపీ మధ్య తీవ్ర పోటీ
- ప్రధాని కరిష్మాపైనే ఆధారపడ్డ బీజేపీ
- బీజేడీ బలం నవీన్ పట్నాయక్ ఇమేజే
- లోక్‌సభతో పాటు రాష్ట్ర అసెంబ్లీకి ఎన్నికలు



భువనేశ్వర్, మే 9: లోక్‌సభ ఎన్నికలతో పాటు అసెంబ్లీకి కూడా ఎన్నికలు జరుగుతున్న ఒడిశాలో రాజకీయ వాతావరణం వేడెక్కింది. 24 ఏండ్లుగా నిరంతరాయంగా అధికారంలో ఉన్న నవీన్ పట్నాయక్‌ను ఈసారి కచ్చితంగా గద్దె దించాలని బీజేపీ పట్టుదలగా ఉంది. మళ్లీ అధికారంలోకి రావడంతో పాటు అత్యధిక లోక్‌సభ స్థానాలను సాధించాలని బిజూ జనతాదళ్ (బీజేడీ) ప్రయత్నిస్తున్నది. ముఖ్యంగా ఒడిశాలో రెండు పార్టీల మధ్య కాకుండా ప్రధాని మోదీ, సీఎం నవీన్ పట్నాయక్ కరిష్మా మధ్య పోటీ నెలకొన్నది. రెండు పార్టీలూ వీరి ఇమేజ్‌తోనే ఓట్లు పొందాలని ప్రయత్నిస్తున్నాయి. మరోవైపు ఓట్ల శాతాన్ని పెంచుకొని పూర్వవైభవం సాధించేందుకు కాంగ్రెస్ ప్రయత్నిస్తున్నది. బీజేపీ, బీజేడీ ఒక్కటేననే వాదనతో కాంగ్రెస్ పార్టీ ప్రచారం చేస్తున్నది. మే 13, 20, 25, జూన్ 1న నాలుగు విడతల్లో ఒడిశాలోని 21 లోక్‌సభ స్థానాలకు, 147 అసెంబ్లీ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి.

**ఫ్రెండ్లీ పార్టీల మధ్య హోరాహోరీ**

బీజేపీ – బీజేడీ మధ్య ముందు నుంచి మంచి స్నేహం కొనసాగింది. గతంలో ఈ రెండు పార్టీలు కలిసి అధికారం పంచుకున్నాయి. 2009 ఎన్నికల ముందు ఆ పార్టీలు వేరుపడ్డాయి. అయినప్పటికీ రెండు పార్టీల మధ్య స్నేహం కొనసాగింది. ఎన్డీఏలో బీజేడీ భాగస్వామిగా లేనప్పటికీ కేంద్రంతో స్నేహపూర్వక వైఖరిని అవలంబించింది. ఈ ఎన్నికల ముందు కూడా రెండు పార్టీల మధ్య పొత్తు చర్చలు జరిగినా సీట్ల పంపిణీ కుదరకపోవడంతో ప్రత్యర్థులుగా రంగంలోకి దిగుతున్నాయి. రాష్ట్రంలో గతంలో బీజేడీ – కాంగ్రెస్ మధ్య పోటీ ఉండేది. 2019లో కాంగ్రెస్‌ను వెనక్కు నెట్టేసి బీజేపీ ప్రధాన రేసులోకి వచ్చింది. 2019లో బీజేడీ 12 లోక్‌సభ, 112 అసెంబ్లీ స్థానాలను దక్కించుకోగా, బీజేపీ ఎనిమిది లోక్‌సభ, 23 అసెంబ్లీ స్థానాలను గెలుచుకుంది. కాంగ్రెస్ ఒక లోక్‌సభ సీటును, 9 అసెంబ్లీ స్థానాలను సాధించింది.

**బీజేపీది దేశమంతా ఒక మాట.. ఒడిశాలో మరో మాట**

ఒడిశాలో బీజేడీకి చెక్ పెట్టడానికి బీజేపీ.. తమిళనాడుకు చెందిన మాజీ ఐఏఎస్ అధికారి, బీజేడీ కీలక నేత కార్తీక్ పాండియన్‌ను లక్ష్యంగా చేసుకుంది. సీఎం పట్నాయక్‌కు ఆయన నమ్మకస్థుడు. దీంతో ఒడిశాలో తమిళ వ్యక్తి పెత్తనం ఏంటి అని ప్రశ్నిస్తూ బీజేపీ ప్రచారం చేస్తున్నది. ఒడియా గొప్పదనం, భాషను లేవనెత్తుతూ పాండియన్‌ను, బీజేడీని ఇరుకున పెట్టే ప్రయత్నం చేస్తున్నది. దేశమంతా జాతీయవాద నినాదంతో, దేశ ప్రజలందరూ ఒక్కటేనని చెప్తూ ప్రచారం చేసే బీజేపీ ఒడిశాలో మాత్రం ఇందుకు విరుద్ధంగా వెళ్తున్నది.

**మోదీ, నవీన్ పట్నాయక్ మధ్య పోటీ**

ఒడిశాలో ప్రధానంగా ప్రధాని మోదీ, సీఎం నవీన్ పట్నాయక్ మధ్యే పోటీ ఉంది. రాష్ట్ర బీజేపీలో చెప్పుకోదగ్గ నేతలు, కేంద్రమంత్రులుగా పని చేస్తున్న వారు సైతం ఉన్నప్పటికీ వీరెవరూ ఒడిశా ప్రజల్లో సీఎం నవీన్ పట్నాయక్‌కు ఉన్న ఇమేజ్‌తో పోటీ పడే స్థాయిలో లేరు. ఈ నేపథ్యంలో బీజేపీ ప్రధానంగా మోదీ ఇమేజ్‌పైనే ఆధారపడింది. మరోవైపు బీజేడీ పూర్తిగా పట్నాయక్ కరిష్మాపైనే నడిచే పార్టీ. అయితే, ఇద్దరి మధ్య పోటీతో క్రాస్ ఓటింగ్ జరిగే అవకాశం కూడా ఉంది. గత ఎన్నికల్లో ఇదే జరిగింది.

**ఓట్లు పెంచుకునేందుకు కాంగ్రెస్ ఎత్తులు**

2019 ఎన్నికల్లో బలహీనపడి, మూడో స్థానానికి పరిమితమైన కాంగ్రెస్ ఈసారి గణనీయంగా ఓట్లు సాధించి పూర్వవైభవాన్ని సాధించాలని ప్రయత్నిస్తున్నది. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ, రాష్ట్రంలో అధికారంలో ఉన్న బీజేడీ వ్యతిరేక ఓట్లను రాబట్టుకునేందుకు ఆ పార్టీ ప్రయత్నిస్తున్నది. బీజేపీ –బీజేడీ ఒక్కటేననే వాదనను బలంగా ప్రచారం చేస్తున్నది. అయితే, కాంగ్రెస్ ఓట్ల శాతం పెరిగితే, ప్రభుత్వ వ్యతిరేక ఓట్లు బీజేపీ, కాంగ్రెస్ మధ్య చీలి తమకు లాభం జరుగుతుందని బీజేడీ భావిస్తున్నది.

## హర్యానాలో బలపరీక్ష జరపాలి: జేజేపీ

చండీగఢ్: హర్యానాలో ఇప్పుడు బీజేపీ ప్రభుత్వానికి మెజారిటీ లేనందున వెంటనే అసెంబ్లీలో విశ్వాస పరీక్ష నిర్వహించాలని జన నాయక్ జనతా పార్టీ (జేజేపీ) నేత, మాజీ డిప్యూటీ సీఎం దుష్యంత్ చౌతాలా డిమాండ్ చేశారు. ఈ మేరకు గవర్నర్ బండారు దత్తాత్రేయకు బుధవారం ఒక లేఖ రాశారు. రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన విధించాలని, గడువుకన్నా ముందే అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించాలని కోరిన కాంగ్రెస్.. తమ ప్రతినిధి బృందం కలిసేందుకు సమయం ఇవ్వాలని గవర్నర్‌ను కోరారు. ఇప్పటికే ముగ్గురు స్వతంత్ర ఎమ్మెల్యేలు మద్దతు ఉపసంహరించుకోవడంతో సైనీ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వం మైనారిటీలో పడింది. అయితే విపక్షాల డిమాండ్‌ను సీఎం నాయబ్ సింగ్ సైనీ తోసిపుచ్చుతూ తమకు సభలో మెజారిటీ ఉందని, మార్చిలోనే తమ ప్రభుత్వం బల పరీక్షలో నెగ్గిన విషయాన్ని గుర్తు చేశారు. అవసరమైతే తిరిగి విశ్వాస పరీక్షను ఎదుర్కోవడానికి సిద్ధమేనని ప్రకటించారు.

## బీజేపీకి కర్ణిసేన చీఫ్ రాజీనామా



సూరజ్ పాల్

గురుగ్రామ్: హర్యానా బీజేపీ అధికార ప్రతినిధి, కర్ణిసేన చీఫ్ సూరజ్ పాల్ అము గురువారం ఆ పార్టీకి రాజీనామా చేశారు. కేంద్రమంత్రి రూపాలాకు టికెట్ ఇవ్వడంపై అసంతృప్తితో ఆయన ఈ నిర్ణయం తీసుకున్నారు. మహిళలను కించపరచే వ్యాఖ్యలు చేసిన వ్యక్తికి గుజరాత్‌లో బీజేపీ టికెట్ ఇవ్వడాన్ని యావత్తు క్షత్రియ సమాజాన్ని అవమానించడంగా పరిగణిస్తున్నట్లు తెలిపారు. రాజ్‌కోట్ లోక్‌సభ టికెట్‌ను కేంద్ర మంత్రి పర్షోత్తమ్ రూపాలాకు బీజేపీ ఇచ్చింది. రాజ్‌పుత్‌లపై రూపాలా వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. బ్రిటిష్ వారితో ఒకే కంచంలో తినడంతో పాటు వారికి తమ కూతుళ్లనిచ్చి మహారాజాలు పెండ్లి చేశారని వ్యాఖ్యానించారు.

## నేడు తెరుచుకోనున్న కేదార్‌నాథ్, గంగోత్రి, యమునోత్రి ఆలయాలు

డెహ్రాడూన్: ఉత్తరాఖండ్‌లోని కేదార్‌నాథ్, గంగోత్రి, యమునోత్రి దేవాలయాల్లో భక్తుల పూజలు శుక్రవారం నుంచి ప్రారంభమవుతాయి. శీతాకాలంలో మూసివేసిన దేవాలయాలను భక్తుల కోసం నేటి నుంచి తెరుస్తున్నారు. కేదార్‌నాథ్, యమునోత్రి దేవాలయాలను శుక్రవారం ఉదయం 7 గంటలకు తెరుస్తారు. గంగోత్రి దేవాలయాన్ని మధ్యాహ్నం 12.20 గంటలకు, బదరీనాథ్‌ను ఈ నెల 12న తెరుస్తారు.

## దేవాలయాల్లో గన్నేరు పూల వాడకంపై నిషేధం

తిరువనంతపురం: కేరళలోని దేవాలయాల్లో గన్నేరు పూలను వాడటం మానేయాలని రెండు ప్రధాన దేవస్థానం బోర్డులు నిర్ణయించాయి. ఈ పువ్వులు విషపూరితమైనవనే ఆందోళన పెరగడంతో ట్రావన్‌కోర్ దేవస్థానం బోర్డు (టీడీబీ), మలబార్ దేవస్థానం బోర్డు (ఎండీబీ) ఈ నిర్ణయం తీసుకున్నాయి. రాష్ట్రంలోని అత్యధిక దేవాలయాలు ఈ రెండింటి పరిధిలోనే ఉన్నాయి. గన్నేరు పూలలోని విష స్వభావం వల్ల మానవులకు, జంతువులకు కూడా హాని జరుగుతుందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

### ప్రపంచ విత్తన ఖజానా సృష్టికర్తలకు
## వరల్డ్ ఫుడ్ ప్రైజ్

వాషింగ్టన్: ప్రపంచ వ్యవసాయ వైవిధ్యాన్ని పరిరక్షించేందుకు విత్తనాలను భద్రపరచాలనే లక్ష్యంతో కృషి చేస్తున్న కేరీ ఫోలర్, జెఫ్రీ హాతిన్‌లకు వరల్డ్ ఫుడ్ ప్రైజ్– 2024 లభించింది. వీరు విత్తనాలను భద్రపరచేందుకు ఆర్కిటిక్ సర్కిల్‌లో నార్వేజియన్ దీవిలో స్వల్బర్డ్ గ్లోబల్ సీడ్ వాల్ట్‌ను నిర్మించారు. 2008 నుంచి ఇప్పటి వరకు దాదాపు 12.5 లక్షల విత్తనాల శాంపిల్స్‌ను భద్రపరిచారు. వీటిని దాదాపు అన్ని దేశాల నుంచి సేకరించారు. కేరీ ఫోలర్ అంతర్జాతీయ ఆహార భద్రతకు సంబంధించిన ప్రత్యేక అమెరికన్ దౌత్యవేత్త కాగా, జెఫ్రీ హాతిన్ బ్రిటన్ వ్యవసాయ శాస్త్రవేత్త, గ్లోబల్ క్రాప్ డైవర్సిటీలో ఎగ్జిక్యూటివ్ బోర్డ్ మెంబర్.

## ముస్లింల జనాభాపై రాజకీయ రగడ
**బీజేపీ, కాంగ్రెస్ పరస్పర విమర్శలు**

న్యూఢిల్లీ, మే 9: దేశంలో 1950–2015 మధ్య ముస్లింల జనాభా 43.15 శాతం పెరిగినట్టు కేంద్రం విడుదల చేసిన డాటా ఎన్నికల్లో రాజకీయ అస్త్రంగా మారింది. అటు అధికార బీజేపీ, ఇటు విపక్ష కాంగ్రెస్ కూటమి పరస్పర విమర్శలకు దిగాయి. ఈ కారణంగానే ముస్లింలకు రిజర్వేషన్లు కల్పించడానికి కాంగ్రెస్ తహతహలాడుతున్నదని బీజేపీ విమర్శలు చేయగా, పార్లమెంట్ ఎన్నికల సమయంలో ఈ వివరాలను ప్రకటించి దేశంలో మత చిచ్చును తేవడానికి కమలం పార్టీ ప్రయత్నిస్తున్నదని కాంగ్రెస్ ఆరోపించింది. కాగా, ఎన్నికల సమయంలో ఇలాంటి నివేదిక వెలువడటం రాజకీయ లబ్ధి పొందడానికేనని సీపీఐ జాతీయ కార్యదర్శి డీ రాజా, ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్ బీజేపీపై మండిపడ్డారు.

## అల్ట్రా ప్రాసెస్డ్ ఫుడ్‌తో ఆయుక్షీణం

న్యూఢిల్లీ, మే 9: రుచిగా ఉన్నాయని చిప్స్, స్నాక్స్, మ్యాగీ వంటి పదార్థాలు తింటున్నారా? హాయిగా, చల్లగా ఉన్నాయని ఫిజీ డ్రింక్స్, కూల్‌డ్రింక్స్ వంటివి తాగుతున్నారా? అయితే మీరు ఆయుక్షీణం కొని తెచ్చుకున్నట్టే లెక్క. ప్రాసెస్డ్ ఫుడ్ మీ జీవితకాలాన్ని తగ్గిస్తుందని, అకాల మరణ ప్రమాదాన్ని పెంచుతుందని తాజా అధ్యయనంలో వెల్లడైంది. 30 ఏండ్ల పాటు సాగిన అధ్యయన నివేదికను బీఎంజే జర్నల్ గురువారం ప్రచురించింది. ఆ అధ్యయనం ప్రకారం.. అధికశక్తి, ఉప్పు, కొవ్వు, చక్కెర అధికంగా ఉండే అల్ట్రాప్రాసెస్డ్ ఫుడ్ తరచూ తీసుకోవడం వల్ల శరీరానికి విటమిన్లు, మినరల్స్ సరైన పాళ్లలో అందకపోవడం వల్ల మనిషి ఆరోగ్యం దెబ్బతింటుంది. అది ఊబకాయం, మధుమేహం, రక్తపోటు, హృదయ సంబంధ వ్యాధులు, క్యాన్సర్ వంటి ప్రమాదాలను పెంచుతుంది. అమెరికా, బ్రెజిల్, చైనాకు చెందిన పరిశోధకులు 1984 నుంచి 2018 మధ్య 11 అమెరికా రాష్ర్టాల నుంచి 74,563 మంది మహిళా నర్సుల దీర్ఘకాలిక ఆరోగ్య రికార్డును పరిశీలించారు.

## చిరంజీవికి పద్మ విభూషణ్ ప్రదానం
**ఆనందాచారి, విఠలాచార్యకు పద్మశ్రీ**



పద్మశ్రీని స్వీకరిస్తున్న ఆనందాచారి

న్యూఢిల్లీ, మే 9: ప్రముఖ తెలుగు నటుడు చిరంజీవి, దిగ్గజ నటి వైజయంతి మాల బాలిలకు రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము గురువారం పద్మ విభూషణ్ పురస్కారాలను అందజేశారు. రాష్ట్రపతి భవన్‌లో జరిగిన ఈ పురస్కారాల ప్రదానోత్సవానికి ఉపరాష్ట్రపతి ధన్‌కర్, ప్రధాని మోదీతో పాటు పురస్కారాల గ్రహీతల కుటుంబ సభ్యులు హాజరయ్యారు. సుప్రీంకోర్టు మొదటి మహిళా న్యాయమూర్తి ఫాతిమా బీవీ, ప్రముఖ తమిళ నటుడు విజయకాంత్, లఢక్ అధ్యాత్మిక గురువు తాంగ్డన్ రిన్‌పొచెయ్‌లకు మరణానంతరం ప్రకటించిన పద్మ భూషణ్ పురస్కారాలను వారి కుటుంబ సభ్యులు రాష్ట్రపతి నుంచి స్వీకరించారు. బాంబే సమాచార్ అధినేత హర్ముస్జీ ఎన్ కామా, గుజరాతీ దినపత్రిక జన్మభూమి సీఈవో కుందన్ వ్యాస్, బీజేపీ నేత ఓ రాజగోపాల్ తదితరులు పద్మ పురస్కారాలు అందుకున్నవారిలో ఉన్నారు. ఇక పద్మశ్రీ అవార్డులను అందుకున్న వారిలో కేరళలోని మహిళా మావటి ప్రభాతి బారువా, తెలంగాణకు చెందిన శిల్పి వేలు ఆనందాచారి, రచయిత విఠలాచార్య, త్రిపురకు చెందిన రేఖా చక్మా, అండమాన్ నికోబార్‌కు చెందిన కే చెల్లమ్మ ఉన్నారు. చిన్నప్పుడు తన రెండు చేతులు, పాదం కోల్పోయిన కర్ణాటకకు చెందిన దివ్యాంగుడు కేఎస్ రాజన్న పద్మశ్రీ అవార్డు అందుకోవడానికి వచ్చినప్పుడు ప్రేక్షకులు పెద్దయెత్తున చప్పట్లతో తమ హర్షధ్వానాలు వ్యక్తం చేశారు. ఈ ఏడాది గణతంత్ర దినోత్సవం సందర్భంగా కేంద్ర ప్రభుత్వం 132 మందికి పద్మ పురస్కారాలను ప్రకటించిన విషయం తెలిసిందే.

# ఇద్దరు భార్యలుంటే రెండు లక్షలు

- మేం గెలిస్తే ఒక్కో మహిళకు ఏడాదికి లక్ష
- మధ్యప్రదేశ్‌లో కాంగ్రెస్ నేత ప్రకటన
- అధికారమే లక్ష్యంగా అడ్డగోలు హామీలు



కాంతిలాల్

భోపాల్, మే 9: కాంగ్రెస్ హామీలు శృతి మించుతున్నాయి. ఎన్నికల్లో ఓట్లు వేయించుకోవడమే లక్ష్యంగా హస్తం పార్టీ నోటికొచ్చిన హామీలన్నీ ఇస్తున్నది. ఓట్లు పడితే చాలు.. తర్వాత ఇచ్చేదా, చచ్చేదా అన్నట్టుగా ఉంది ఆ పార్టీ నేతల వ్యవహారం. మధ్యప్రదేశ్‌కు చెందిన కాంగ్రెస్ నేత కాంతిలాల్ భురియా అయితే.. మేము గెలిస్తే ఒక్కో మహిళకు ఏడాదికి లక్ష రూపాయలు బ్యాంకు ఖాతాలో వేస్తామని హామీ ఇచ్చాడు. అంతటితో ఆగకుండా.. ఇద్దరు భార్యలుంటే రెండు లక్షలు వేస్తామని ప్రకటించాడు. ఏది పడితే అది మాట్లాడేందుకు ఆయనేమీ అల్లాటప్పా నేత కూడా కాదు. ఐదుసార్లు ఎంపీగా, ఒకసారి కేంద్రమంత్రిగా కూడా పని చేశారు. ఇప్పుడు మరోసారి మధ్యప్రదేశ్‌లోని రత్లం లోక్‌సభ నియోజకవర్గం నుంచి ఆయన కాంగ్రెస్ తరఫున పోటీ చేస్తున్నారు. గురువారం ఆయన ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. 'కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ఒక్కో మహిళ బ్యాంకు ఖాతాలో లక్ష రూపాయలు వేస్తామని మేము మ్యానిఫెస్టోలో పెట్టాం. ప్రతి ఇంట్లో మహిళకు లక్ష రూపాయలు వస్తాయి. ఒకవేళ ఎవరికైనా ఇద్దరు భార్యలు ఉంటే రెండు లక్షలు వస్తాయి' అని ఆయన వ్యాఖ్యానించారు. కర్ణాటకలో ప్రతి మహిళకు రూ.2 వేలు ఇస్తామని చెప్పి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. ఇదేదో బాగుందే అని తెలంగాణలో రూ.2,500 ఇస్తామని చెప్పి గెలిచి 5 నెలలుగా అవుతున్నది. అయినా ఇంతవరకు అమలు చేయలేదు. ఇప్పుడు ఇదే ఫార్ములాను దేశమంతా ఫాలో అవుతున్నది కాంగ్రెస్.

## చంద్రుడిపైకి 'మెమొరీ డిస్క్'

టోక్యో, మే 9: ఏదైనా విపత్తు తలెత్తి భూమి మీద మానవాళి మనుగడకు ముప్పు వాటిల్లినా ఇక్కడి భాషాసంస్కృతులు మాత్రం చంద్రుడిపైన ఎప్పటికీ నిక్షిప్తమై ఉండేలా జపాన్‌కు చెందిన ఐస్పేస్ అనే ప్రైవేటు అంతరిక్ష సంస్థ ఒక కొత్త ప్రయోగాన్ని చేపట్టనుంది. ఇందులో భాగంగా చంద్రుడి ఉపరితలం మీదకు రోబోటిక్ ల్యాండర్‌తో ఒక మెమొరీ డిస్క్‌ను పంపించనుంది. ఈ డిస్క్‌లో యునెస్కో రాజ్యాంగ పీఠికలో ఉన్న 275 భాషలు పొందుపర్చనున్నారు.

## టెన్త్ పరీక్షల్లో 625/625 మార్కులు

బెంగళూరు: కర్ణాటకలోని బాగల్‌కోట్ జిల్లాకు చెందిన అంకిత కొనసప్ప టెన్త్ పరీక్షల్లో 625/625 మార్కులు సాధించి అందరి అభినందనలు పొందుతున్నది. రైతు కుటుంబంలో జన్మించిన అంకిత మరింత బాగా చదువుకుని ఐఏఎస్ అధికారిగా దేశానికి సేవలందించాలని ఆకాంక్షిస్తున్నది. ఆమె తండ్రి బసప్ప రైతు కాగా, తల్లి గృహిణి. ఆమె ముథోల్ తాలూకాలో మొరార్జీ దేశాయ్ రెసిడెన్షియల్ పాఠశాలలో చదివింది.

# చక్కెర, ఉప్పు తగ్గించండి

- అల్ట్రా ప్రాసెస్డ్ ఫుడ్ వల్ల జబ్బుల ముప్పు అధికం
- ప్రొటీన్ సప్లిమెంట్లతో కిడ్నీలు పాడయ్యే ప్రమాదం
- ఐసీఎంఆర్ – ఎన్‌ఐఎన్ కొత్త ఆహార మార్గదర్శకాలు



న్యూఢిల్లీ: రోగాల ముప్పును తగ్గించుకునేందుకు చక్కెర, ఉప్పు తినడాన్ని తగ్గించాలని ప్రజలకు నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్(ఎన్‌ఐఎన్) సూచించింది. ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రిసెర్చ్(ఐసీఎంఆర్) ఆధీనంలోని ఎన్‌ఐఎన్ 13 ఏండ్ల తర్వాత భారతీయుల కోసం కొత్త ఆహార నియమావళిని ప్రకటించింది. ప్రజలు ఆహారం, జీవనశైలిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను సూచించింది. మొత్తం జబ్బుల్లో 56.4 జబ్బులకు కారణం అనారోగ్యకర ఆహారమేనని పేర్కొంది. ఆరోగ్యకర ఆహార అలవాట్లు, శారీరక శ్రమ వల్ల గుండెజబ్బులు, బీపీ ముప్పు భారీగా తగ్గడంతోపాటు టైప్ 2 మధుమేహం ముప్పు 80 శాతం వరకు తగ్గుతుందని తెలిపింది. అకాల మరణాల ముప్పునూ గణనీయ స్థాయిలో తగ్గించవచ్చని పేర్కొంది. వంటల్లో నూనెల వినియోగాన్ని తగ్గించాలని, నూనెగింజలు, నట్స్, సీఫుడ్ ద్వారా శరీరానికి అవసరమైన ఫ్యాటీ యాసిడ్స్‌ను పొందాలని సూచించింది.

**సమతుల ఆహారం ఇలా..**

చక్కెర, కొవ్వులు ఎక్కువగా ఉండే అధికంగా ప్రాసెస్ చేసిన ఆహారాలను ఎక్కువగా తినడం, శారీరక శ్రమ లేకపోవడం, విభిన్న ఆహారాన్ని తీసుకోకపోవడం కారణంగా దేశంలో ఊబకాయం, సూక్ష్మపోషక లోపాలు వంటి సమస్యలు ఎదురవుతున్నాయని ఈ సంస్థ పేర్కొన్నది. భారతీయులు రోజుకు 20 – 25 గ్రాముల కంటే ఎక్కువ చక్కెర తీసుకోవద్దని, మనం తినే కార్బోహైడ్రేట్స్ నుంచే ఇంత మొత్తం చక్కెర శరీరానికి అందుతుంది కాబట్టి, వేరుగా చక్కెర కలిపిన పానీయాలు, ఆహారాన్ని తగ్గించాలని సూచించింది. సమతుల ఆహారాన్ని తీసుకోవాలని, శరీరానికి అందే క్యాలరీల్లో 46 శాతం ధాన్యాలు, మిల్లెట్స్ నుంచి, 15 శాతం క్యాప్సులు, మాంసం, బీన్స్ నుంచి, మిగతా క్యాలరీలు కూరగాయలు, పండ్లు, పాలు, నట్స్ నుంచి అందేలా చూసుకోవాలని తెలిపింది. శరీరానికి ఇచ్చే మొత్తం క్యాలరీల్లో చక్కెర ద్వారా అందేవి 5 శాతం లోపు మాత్రమే ఉండాలని, కొవ్వు ద్వారా 30 శాతం లోపు ఉండేలా చూసుకోవాలని సూచించింది.

**ప్రొటీన్ సప్లిమెంట్లు వాడొద్దు**

కండలు పెంచేందుకు ప్రొటీన్ పౌడర్లు, సప్లిమెంట్‌లు ఎక్కువగా తీసుకోవడం వల్ల అనేక ప్రమాదాలు ఉన్నాయని ఎన్‌ఐఎన్ పేర్కొంది. వీటి వల్ల కిడ్నీలు పాడయ్యే ముప్పు ఉంటుందని, ఎముకలు క్షీణిస్తాయని తెలిపింది. శరీర బరువులో ఒక కిలోకు రోజుకు 1.6 గ్రాముల కంటే ఎక్కువ ప్రొటీన్ తీసుకుంటే, అది కండలు పెరిగేందుకు కూడా ఉపయోగపడదని పేర్కొంది.

## ఏఐఈ ఉద్యోగుల సమ్మె విరమణ
**తొలగించినవారిని విధుల్లోకి తీసుకుంటామని సంస్థ ప్రకటన**




న్యూఢిల్లీ, మే 9: ఉద్యోగులు లేవనెత్తిన అంశాలపై చర్చించడానికి 'ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్' అంగీకరించటంతో క్యాబిన్ సిబ్బంది సమ్మెను విరమించారు. గురువారం న్యూఢిల్లీలో చీఫ్ లేబర్ కమిషనర్ (సెంట్రల్) కార్యాలయంలో ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్, ఉద్యోగుల సంఘానికి (ఏఐఎక్స్‌ఈయూ) మధ్య ఐదు గంటలపాటు జరిగిన చర్చలు ఫలించాయి. విధుల నుంచి తొలగింపునకు గురైన 25 మంది క్యాబిన్ సిబ్బందిని తిరిగి విధుల్లోకి తీసుకోవడానికి యాజమాన్యం అంగీకరించింది. దీంతో తాము చేపట్టిన నిరసనను క్యాబిన్ ఉద్యోగులు విరమించారు. ఉద్యోగుల సమస్యలపై మే 28న ఇరు వర్గాలు చర్చించనున్నాయి. దాదాపు 300మందికిపైగా క్యాబిన్ సిబ్బంది మూకుమ్మడి సెలవులు తీసుకోవటంతో, మంగళవారం రాత్రి నుంచి సంక్షోభం మొదలైంది. సుమారుగా 170కిపైగా విమానాలను 'ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్' రద్దు చేసుకోవాల్సి వచ్చింది. దీంతో వేలాది మంది విమాన ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు.

**మరో 85 విమానాలు రద్దు**

క్యాబిన్ సిబ్బంది మూకుమ్మడిగా సిక్ సెలవులు కారణంగా గురువారం మరో 85 ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ విమానాలు రద్దు చేయాల్సి వచ్చింది. తొలగించిన ఉద్యోగుల్ని తిరిగి విధుల్లోకి చేర్చుకోకపోతే మిగతా సిబ్బంది కూడా రారని ఉద్యోగ సంఘాల ప్రతినిధి తొలుత తేల్చి చెప్పారు. 'సిబ్బంది పట్ల యాజమాన్యం సరైన వైఖరి అనుసరించటం లేదు. సీనియర్ స్థానాలకు జరిగిన ఇంటర్వ్యూలను కొంతమంది పూర్తిచేసినా.. వారికి ఆ ఉద్యోగాలు ఇవ్వలేదు. మెరుగైన వేతన ప్యాకేజీలు అమలు జేయటం లేదు' అని 'ఏఐఎక్స్‌ఈయూ' ప్రతినిధులు తెలిపారు. ఉద్యోగుల ఆందోళనకు సహేతుకమైందని రీజినల్ లేబర్ కమిషనర్ అభిప్రాయపడ్డారు. కార్మిక చట్టాల ఉల్లంఘనలు సంస్థలో పెద్ద ఎత్తున ఉందన్న సంగతి మే 3న ఎయిర్ ఇండియా చైర్మన్ నటరాజన్ చంద్రశేఖరన్‌కు రాసిన లేఖలో కమిషనర్ పేర్కొన్నారు.

## చంపైనా సరే భూమి లాక్కోండి!
**అధికారులకు సౌదీ ఆదేశం**

రియాద్: సౌదీ అరేబియా సర్కారు అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న 'నియోమ్' ప్రాజెక్టు కోసం సంచలన నిర్ణయం తీసుకున్నట్టు సమాచారం. భూ సేకరణకు ఇబ్బందులు ఎదురైతే ఆయా ప్రాంతాల్లోని గ్రామస్థులను చంపాలని భద్రతా బలగాలను ఆదేశించినట్టు తెలిసింది. వివరాల్లోకెళితే.. సౌదీ అరేబియా క్రౌన్ ప్రిన్స్ మహ్మద్ బిన్ సల్మాన్ సౌదీ విజన్–2030లో భాగంగా 'నియోమ్' పేరుతో కలల నగరాన్ని నిర్మించాలని ప్రణాళిక రచించారు. ఈ నగరం న్యూయార్క్ కంటే 33 రెట్లు పెద్దగా ఉంటుంది.

## చదవాలని లేదు.. వెళ్లిపోతున్నా!
**ఐదేండ్లపాటు కనిపించనన్న నీట్ విద్యార్థి**

కోటా (రాజస్థాన్): 'నాకు పై చదువులు చదవాలని లేదు. నా దగ్గర రూ.8 వేలు ఉన్నాయి. నేను ఐదేండ్లపాటు వెళ్లిపోతా. నేను ఎలాంటి తప్పుడు నిర్ణయాలు తీసుకోను. కచ్చితంగా ఏడాదికోసారి కాల్ చేస్తా' అని తండ్రి ఫోన్‌కు మెసేజ్ పెట్టి 19 ఏండ్ల విద్యార్థి అదృశ్యమయ్యాడు. నీట్‌కు రాజస్థాన్‌లోని కోటాలో ప్రిపేర్ అవుతున్న తన కొడుకు ఈ నెల 6న ఇలా మెసేజ్ పెట్టడంతో అతడి తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

## బాణసంచా పేలుడులో 9 మంది మృతి

చెన్నై: తమిళనాడులోని శివకాశిలో బాణసంచా తయారు చేస్తుండగా గురువారం సంభవించిన పేలుడు వల్ల ఆరుగురు మహిళలు సహా, 9 మంది కార్మికులు మరణించారు. సుమారు 10 మంది గాయపడ్డారు. బాణసంచా నిల్వ ఉంచి ఏడు గదులు పూర్తిగా కాలిపోయాయి. ప్రమాద కారణం తెలియలేదు.